

ఘనంగా పండిత సదస్యం
అప్పనపల్లిలో వైభవంగా కొనసాగుతున్న బాలబాలాజీ కల్యాణోత్సవాలు... 7లో

గోగన్నమఠంలో అగ్ని ప్రమాదం
రూ.2 లక్షలు విలువైన కొబ్బరి రాశులు దగ్ధం
... వివరాలు 7లో



నల్లమిల్లిలోని బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్

- బీఎంసీ యూనిట్లకు భవనాల నిర్మాణం కోసం చకచకా పనులు
- ప్రారంభించకుండానే మూత
- భవనాలు, సామగ్రి మాటేమిటో!



'పాలవెల్లువ' పేరిట హడావుడి



బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన యంత్ర సామగ్రి

గత వైసీపీ ప్రభుత్వం పాల సరఫరా కోసం అమూల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జగనన్న పాలవెల్లువ పేరుతో జిల్లా అధికారులు భవనాల నిర్మాణం కోసం, ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు కోసం కింది స్థాయి అధికారులను పరుగులు పెట్టించారు. అమూల్ సంస్థకు పాలను ధారాదత్తం చేసేందుకు జగన్ ప్రభుత్వం జిల్లా అధికారులపై అప్పట్లో ఒత్తిడి పెంచింది. దాంతో జిల్లాలో హడావుడిగా నిర్మాణాలు, పనిచేసే సిబ్బందికి ఇంటర్వ్యూలు, ఏఎంసీల ఏర్పాటు చకచకా చేశారు. జిల్లా నుంచి ఒక్క లీటరు పాలు కూడా సేకరించకుండానే పాలవెల్లువ ఆగిపోయింది.

అమలాపురం టౌన్, జూన్ 18: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయని తెలిసి కూడా గత జగన్ ప్రభుత్వం అమూల్‌కు పాలను దారబోయాలని సర్వశక్తులూ ఒడ్డింది. 'జగనన్న పాలవెల్లువ' పేరిట జిల్లాలోని అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి, కొత్తపేట మండలం వాడపాలెం, రావులపాలెం మండలం గోపాలపురం, రాయవరం, జెడ్.మేడపాడు గ్రామాల్లో ఐదు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేసింది. 5వేల లీటర్ల కెపాసిటీతో బీఎంసీలను ఏర్పాటు చేశారు. హడావుడిగా భవనాల నిర్మాణం జరపడమే కాదు పాల సేకరణకు, పాలను నిల్వ చేసేందుకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేసింది. యంత్ర పరికరాలను హడావుడిగా బిగించారు. అలా బిగించారో లేదో మరుసటి రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దాంతో బీఎంసీలు ప్రారంభించకుండానే మూతపడ్డాయి.

నిరుద్యోగులతో ఆటలు...

పాల సేకరణను క్షేత్రస్థాయి నుంచి నిర్వహించేందుకు, పాల శుద్ధిని పరీక్షించేందుకు ఇలా వివిధ విభాగాల్లో సిబ్బందిని నియమించేందుకు జిల్లా స్థాయిలో అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సార్వత్రిక ఎన్నికల ముందు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది నిరుద్యోగులు హాజరయ్యారు. నిపుణులైనవారిని ఆయా ఉద్యోగాలకు ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఇదంతా ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడానికి వారం ముందు వరకు జరిగిన ప్రక్రియ. ఎంపికైన అభ్యర్థులు ఏదో ఒక రోజున పిలుపు వస్తుందని ఆశగా ఎదురుచూస్తూనే జరిగిన మోసాన్ని తలుచుకుని మదనపడ్డారు.



పాలవెల్లువలో పనిచేసేందుకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (పాత చిత్రం)

ఆ భవనాలు ఇక అంతేనా...

గ్రామస్థాయి నుంచి పాల సేకరణకు మహిళా రైతు ప్రతినిధులతో ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. మండలాల వారీగా ఏఎంసీలను ఏర్పాటు చేయడమేకాకుండా ఒక్కో ఏఎంసీ నుంచి 180 లీటర్ల చొప్పున పాలను సేకరించడం లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే యంత్ర పరికరాలను పూర్తిస్థాయిలో బిగించి సిద్ధంగా ఉన్న భవనాలకు వేసిన తాళాలే తీయలేదు. ఇక ఏఎంసీల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వంలో బీఎంసీలను వినియోగంలోకి తీసుకువస్తారా.. పాల సేకరణ జరుగుతుందా. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయా, అమూల్ సంస్థతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు అటకెక్కినట్టేనా, ఇలా ఎన్నో ప్రశ్నలు జిల్లాలోని పాడి రైతులతో పాటు మహిళలను, నిరుద్యోగులను వేధిస్తున్నాయి. నిరుపయోగ భవనాల జాబితాల్లోకి బీఎంసీలను చేర్చకుండా ప్రభుత్వమే పాల సేకరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటే మంచిదన్న భావనను పాడి రైతులు వ్యక్తం చేస్తున్నారు.

1,22,279 మందికి రూ.24.45 కోట్ల లబ్ధి

'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' నిధులు విడుదల



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

అమలాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 17వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను రైతులబ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. జిల్లాలోని 1,22,279 మంది రైతులకు ఒక్కొక్కరికీ రూ.2వేలు చొప్పున రూ.24,45,58,000 జమ అయ్యాయి. వారాణసీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను విడుదల చేశారు. రైతు సంక్షేమమే పరమావధిగా ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని తెలుపుతూ ఈ నిధులను విడుదల చేసిందన్నారు. భూమి ఉన్న రైతుల కుటుంబాలకు మూడు సమాన వాయిదాల్లో ఏటా రూ.6వేలు ఆర్థిక ప్రయోజనాన్ని ఈ పథకం కింద అందజేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగానికి మరింత ప్రయోజనం చేకూర్చే చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. నాలుగు నెలలకొకసారి కేంద్రం ఈ సాయాన్ని విడుదల చేస్తుందన్నారు. నిధుల విడుదల కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయాధికారులు, రైతులు వీక్షించారన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లిలో మంచినీటి కుళాయిల వద్ద మహిళల పడిగాపులు

నిర్వహణ లోపం...

తాగునీటికి శాపం

- పాత యంత్రాలకే కొత్త సోకులు
- వ్యవధి మీరిన మోటార్లతోనే కాలక్షేపం
- ఫిల్టర్ బెడ్‌లనూ పట్టించుకోని వైనం
- సమస్యలపై సకాలంలో స్పందించని కాంట్రాక్టర్
- పది రోజులుగా గ్రామాల్లో తాగునీటి తిప్పలు
- జనరేటర్‌కు నోచుకోని మెగా ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టు
- ఐదేళ్లలో తాగునీటి సరఫరాను పట్టించుకోలేదని వాపోతున్న సర్పంచ్‌లు



గోప వరంలో...

ఉప్పలగుప్తం, జూన్ 18: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు పది రోజులుగా తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పంచాయతీల్లో ట్యాంకులకు నీటి పంపింగ్ జరుగుతోంది. అయితే కుళాయిల నుంచి నీరు సన్నధారగా కారుతోంది. సమయం గడిచిపోతుంది. బిందెలు మాత్రం నిండవు. ట్యాంకులు నింపేస్తున్నామని ప్రాజెక్టు సిబ్బంది అంటున్నారు. తాగునీరు అందట్లేదని జనం సర్పంచ్‌లను నిలదీస్తున్నారు. అంతా సక్రమంగా ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెప్తున్నారు. కాగా ఈ అంశాన్ని సర్పంచ్‌లు సీరియస్‌గా తీసుకున్నారు. మండలంలో మూడు తాగునీటి ప్రాజెక్టులున్నా ఎండలు మండుతున్న సమయంలో పూర్తిస్థాయిలో తాగునీరందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వం రంగంలోకి దిగి దాహం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉప్పలగుప్తం మండలంలోని చల్లపల్లి ఆర్‌డబ్ల్యుఎస్ మేజర్ ప్రాజెక్టు ద్వారా 28 ఆవాసాలకు నీరందిస్తున్నారు. ఇక్కడ మూడు 20హెచ్‌పీ మోటార్లున్నాయి. రెండు వాడకంలో ఉండగా ఒకదానిని అదనంగా ఉంచుతారు. అత్యవసర సమయంలో దీనిని ఉపయోగిస్తారు. అదనపు మోటారును ఆధునికీకరించకుండా మూలన పడేస్తే అత్యవసరం నెరవేరదు కదా! ఇక్కడ జరుగుతున్నది మాత్రం అదేనని పలుమార్లు తేలింది. కాలం చెల్లిన యంత్రాలకు మరమ్మతులు చేయిస్తున్నారే తప్ప కొత్తవాటిని తేవడం లేదన్నది వాస్తవం. కాలం చెల్లిన యంత్రాలతో పంపింగ్ సక్రమంగా లేక గ్రామాలకు అరకొరగానే నీరందుతోంది. కూనవరం ప్రాజెక్టు ద్వారా 18 ఆవాసాలకు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఇక్కడ మూడు ఫిల్టర్లకు ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. వాల్వ్ చాంబర్‌లో గేట్‌వాల్ పని చేయట్లేదు. ఇక్కడ తక్కువ సామర్థ్యం గల మోటార్లనే పంపింగ్‌కు వాడుతున్నారు. భీమనపల్లి ప్రాజెక్టు ద్వారా నాలుగు గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక్కడా పాత మోటార్లతోనే కాలక్షేపం చేస్తున్నారు. చల్లపల్లి ప్రాజెక్టు వద్ద జనరేటర్ లేక పవర్ ఉన్నప్పుడే పంపింగ్ చేస్తున్నారు. దీంతో కొన్ని గ్రామాలకు నీరందట్లేదు. విద్యుత్ బిల్లులు, యంత్రాల నిర్వహణ, మెయిన్ పైప్‌లైను మరమ్మతులు, సిబ్బంది జీతాలకు ఏటా చల్లపల్లి ప్రాజెక్టుకు రూ.1.80 కోట్లు, కూనవరం ప్రాజెక్టుకు రూ.1.30 కోట్లు, భీమనపల్లి ప్రాజెక్టుకు రూ.80లక్షలు మంజూరు చేస్తారు. ఈ మొత్తం కాంట్రాక్టర్ పర్యవేక్షణలో జరుగుతుంది. అయితే సమస్య తలెత్తినప్పుడు కాంట్రాక్టరు సకాలంలో స్పందించనందున నీటి ఇక్కట్లు పెరుగుతున్నాయన్నది సిబ్బంది మాట. సిబ్బందికి మూడు నెలలకు కూడా జీతం చెల్లించని పరిస్థితి. గతం టీడీపీ హయాంలో ప్రజాప్రతినిధులు ప్రాజెక్టు పనితీరును పర్యవేక్షించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేవారు. వైసీపీ పాలనలో ఈ ప్రాజెక్టులను పట్టించుకున్న వారే లేరు. కాంట్రాక్టరు ఇష్టారాజ్యంతో తాగునీటి ఇబ్బందులు నానాటికీ పెరుగుతూ వచ్చాయన్నది ప్రజల వ్యాఖ్యానం.

కొత్త ప్రభుత్వంలో పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం



నల్లా బాబండి, సర్పంచ్, వానపల్లిపాలెం

తాగునీరందకపోతే ప్రజలు మమ్మల్నే నిలదీస్తారు. ప్రాజెక్టు వద్ద ఏమి జరుగుతోందో ఎవరికీ తెలియట్లేదు. పది రోజులుగా నీరందక జనం పాట్లు పడుతున్నారు. అధికారులేమో పంపింగ్ చేశామంటున్నారు. పంచాయతీ ట్యాంకు నిండట్లేదు. టీడీపీ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాజెక్టుల కార్యకలాపాలపై ఆరాతీసేవారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి అధికారులతో సమీక్షించేవారు. తగిన చర్యలు తీసుకునేవారు. కొత్త పాలకులు తాగునీటి సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.



తాగునీటి ఇక్కట్లు పెరిగిపోతున్నాయి

చిక్కం జంగమయ్య, సర్పంచ్, సన్నవిల్లి

సర్పంచ్‌గా ప్రజలకు కనీసం దాహం తీర్చలేకపోతున్నాం. రోజూ ఏదో ఒక సమస్య. ఒకరోజు కరెంటు లేదంటారు. మరో రోజు పైప్‌లైన్లో లోపమంటారు. ఎక్కడ సమస్య ఉన్నా ప్రజలు నిలదీసేది మమ్మల్నే. తాగునీటి సరఫరా విషయంలో అజమాయిషీ కొరవడింది. తగిన స్థాయిలో కుళాయిల ద్వారా నీటి ప్రవాహం లేక సగం మందికే బిందెలు నిండుతున్నాయి. కొత్త పాలకులు నీటి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఇబ్బందులను ఎప్పటికప్పుడు సరిదిద్దుతున్నాం

సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి

సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే నీటి పంపింగ్‌లో కొంత జాప్యం జరుగుతుంది. పైప్‌లైన్లు దెబ్బతిన్నప్పుడు కొన్ని ప్రాంతాలకు తాత్కాలికంగా సరఫరా నిలిచిపోవడం సాధారణం. ఇటీవల కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తిన మాట నిజమే. వాటిని సత్వరం పరిష్కరించాం. నిరంతరం నీటి పంపింగ్‌కు చర్యలు తీసుకున్నాం.

తువ్వ ఇసుక తవ్వితే కఠిన చర్యలు

వాహనాలను సీజ్ చేస్తాం

అల్లవరం తహసీల్దారు సునీల్‌కుమార్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లవరం, జూన్ 18: సముద్ర తీర ప్రాంతాల్లో అనుమతి లేకుండా తువ్వ ఇసుక తవ్వకాలు జరిపితే సహించమని, ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేస్తామని అల్లవరం తహసీల్దారు పి.సునీల్‌కుమార్ హెచ్చరించారు. 'తువ్వేస్తున్నారు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తీర ప్రాంతాల పరిరక్షణకు ఇసుక తవ్వకాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు పోలీసుల సహకారం తీసుకుంటామన్నారు. ఇసుక తవ్వకాలపై సమాచారం అందితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. వీఆర్వోల ద్వారా తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలపై ఆరా తీస్తున్నామని తహసీల్దారు సునీల్‌కుమార్ చెప్పారు.

వైసీపీ నాయకుల ఏలుబడిలోనే పీఏసీఎస్‌లు

అమలాపురం రూరల్, జూన్ 18: జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలు వైసీపీ నాయకుల ఏలుబడిలోనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించలేదు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే త్రిసభ్య కమిటీలను నియమించి పాలన కొనసాగించారు. త్రిసభ్య కమిటీలను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తున్నట్టు ప్రచారం జోరందుకుంది. అయినప్పటికీ త్రిసభ్య కమిటీలే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు ఎదురు చూస్తారా లేక ముందుగానే రాజీనామా చేస్తారో వేచి చూడాల్సిందే. జిల్లాలో 166 పీఏసీఎస్‌లు ఉన్నాయని జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ తెలిపారు. మామిడికుదురు మండలం నగరం, ఈదరాడ పీఏసీఎస్‌లు అధికారుల ఏలుబడిలో ఉండగా మిగిలిన 164 పీఏసీఎస్‌ల్లో త్రిసభ్య కమిటీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు కమిషనరుకు నివేదిక అందజేశామన్నారు. త్రిసభ్య కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇంతవరకు ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు.



లంకలగన్నవరం వంతెన పిల్లర్ల వద్ద ప్రధాన పంటకాల్వలో చెత్త

ఇలాగైతే.... సాగునీరు ముందుకు సాగేదెలా!

పి.గన్నవరం, జూన్ 18: పంట కాల్వల పర్యవేక్షణను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో భారీగా మట్టి, చెత్త పేరుకుపోయి కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. అంతే కాకుండా కాల్వలపై ఉన్న వంతెనల పిల్లర్ల వద్ద మట్టితో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తాచెదారం అడ్డుపడి సాగునీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. అయితే విరామ సమయం పూర్తి కావడంతో ఇటీవలే పంట కాల్వలకు సాగునీటిని వదిలారు. ఈ క్రమంలోనే లంకల గన్నవరం ప్రధాన పంటకాల్వ వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త, సాగునీరు ముందుకు వెళ్లకుండా ఆటంకం కలిగిస్తోంది. ప్రధాన పంట కాల్వల వెంబడి ప్రతి వంతెన వద్దా ఇదే పరిస్థితి నెలకొంది. సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ఇటువంటి అడ్డంకులతో శివారు ప్రాంతాల పొలాలకు పూర్తి స్థాయిలో నీరందక ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కాల్వ విరామ సమయంలో హెచ్చరించినప్పటికీ ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోలేదు. అధికారులు స్పందించి కనీసం వంతెనల పిల్లర్ల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా ములికిపల్లి-గోగన్నమఠం పంట కాల్వ



గోగన్నమఠం పంట కాల్వలో పడిపోయిన చెట్టు

మామిడికుదురు, జూన్ 18: మండలంలోని ములికిపల్లి నుంచి గోగన్నమఠం వరకు గల పంట కాల్వ అధ్వానంగా తయారైంది. సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు గల ఈ పంట కాల్వ సుమారు 7 కిలోమీటర్ల మేర ఉంది. ప్రస్తుతం వివిధ రకాల వ్యర్థాలు, గుర్రపు డెక్కతో పూడుకుపోయింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా వేసవి కాలంలో మట్టిని తరలించడానికి కాల్వ గట్టున అడ్డుకట్టలు వేసి వాటిని అలాగే వదిలేశారని చెప్తున్నారు. ఇదే కాకుండా కాల్వ పక్కన గల చెట్లు కాల్వలో పడిపోయినప్పటికీ వాటిని తొలగించలేదని, ఎక్కడపడితే అక్కడ కాల్వ పూడుకుపోయి మెరకగా తయారైందని రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వకు నీరు విడిచిపెట్టినా ఇప్పటివరకు తమ గ్రామానికి కాల్వ నీరు రాలేదని గోగన్నమఠం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏఈ సుందర్‌సింగ్‌కు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించలేదని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే కాల్వను ఆధునికీకరించి సార్వా పంటకు అవసరమైన సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



గోగన్నమఠం పంట కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

జిల్లాలో 215 పాఠశాలల్లో ఆడిట్ పూర్తి

ఆలమూరు, జూన్ 18: పాఠశాలల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై సమగ్ర ఆడిట్‌ను మంగళవారం ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు ఆలమూరు, కె.గంగవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట, రావులపాలెం, కొత్తపేట మండలాలకు చెందిన 215 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆడిట్ పూర్తి చేశామని ఆడిట్ బృందం ప్రతినిధులు జి.ప్రవీణ్‌కుమార్, పి.రాంబాబు చెప్పారు. అమలాపురం, అయినవిల్లి, అల్లవరం, అంబాజీపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, మామిడికుదురు, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం మండలాల్లోని 315 పాఠశాలల్లో రెండో దశలో ఆడిట్ చేస్తామని వారు చెప్పారు. మండల విద్యాశాఖ కార్యాలయాల్లో కూడా ఆడిట్ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలమూరు ఎంఈవో షాలెంరాజు, ఆలమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి అప్పాజీ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడిట్ నిర్వహించిన బృందం

కొమ్మనాపల్లిలో తగ్గాయి..బెండపూడిలో పెరిగాయి

- మరో గ్రామంలో డయేరియా కేసులు
- వైద్య సిబ్బంది అప్రమత్తం


సిబ్బందితో మాట్లాడుతున్న గాయత్రీదేవి

తొండంగి, జూన్ 18: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో గత వారం రోజులుగా నమోదవుతున్న డయేరియా కేసుల ఉధృతి తగ్గి కనిష్ఠ స్థాయికి చేరుకోగా ఈ దశలో కొత్తగా బెండపూడిలో 18 డయేరియా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కొమ్మనాపల్లిలో సుమారు వంద కేసులు వరకూ నమోదు కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం అంతా మకాం వేసి వారం రోజులుగా స్థానికంగాను, కాకినాడ జీజీహెచ్‌లోను రోగులకు చికిత్స అందించడంతో మంగళవారానికి తీవ్రత మూడు కేసులకు తగ్గింది. కాకినాడ నుంచి సుమారు 25 మంది జీజీహెచ్ నుంచి, మరో 15 మంది ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రిలీవ్ అయ్యారు. అధికార యంత్రాంగం, ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో బెండపూడి గ్రామంలో భారీగా డయేరియా కేసులు నమోదు కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బెండపూడి సబ్ సెంటర్‌లో 10 మందికి చికిత్స అందించి మరో 8 మందిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సబ్‌సెంటర్‌లో బెడ్ అందుబాటులో లేకపోవడంతో కుర్చీలలోనే పడుకోబెట్టి సెలైన్ పెడుతున్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సరిత గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రిదేవి రోగుల్ని పరామర్శించి వైద్యులతో సమావేశమయ్యారు. వ్యాధి వ్యాప్తికి గల కారణాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కొమ్మనాపల్లి వైద్య శిబిరంలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి రోగులకు చికిత్స అందించారు. బెండపూడి గ్రామంలో నూతి నీటిని తాగునీటిగా ఉపయోగించడం వలనే డయేరియా వ్యాప్తి చెంది ఉంటుందని భావించి ఆ నీటిని ఉపయోగించవద్దని నోటీసు అంటించి చుట్టూ కంపతో మూసివేశారు.

తాగునీటి వనరుల పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్

డయేరియా వంటి సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాగునీటి వనరులు పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ గాయత్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె డయేరియా ప్రభావిత గ్రామాలైన కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో ఆ శాఖ అధికార బృందంతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాగునీటి వనరుల శుభ్రతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని తమ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. దీనిలో భాగంగా గతంలో ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరిచిన తేదీతో సంబంధం లేకుండా అన్ని ట్యాంకులను శుభ్రపర్చడం, ప్రజలకు వెళ్లే ప్రతి నీటి చుక్కను క్లోరినేషన్ చేసి అందించడం ,పైప్‌లైన్ లీకులు, ఇతరత్రా ఎటువంటి లీకులు లేకుండా చూడడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. తాగునీరు,ఆహార కాలుష్యం కారణంగా డయేరియా వ్యాధి ప్రబలుతుందని. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కొమ్మనాపల్లి గ్రామంలో కొన్ని ప్రాంతాల్లోని నీటి శాంపిళ్లు తాగడానికి అనువైనది గాను మరికొన్ని ప్రాంతాల్లో అనువైనది కాదని రిపోర్టు వచ్చినందున ఆయా ప్రాంతాల్లో రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు దళిత వాడలో కొత్తబోరు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాధి బాధితులు ఉన్న వీధిలో పర్యటించి వ్యాధి వ్యాప్తికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ఆమె బెండపూడిలో అధికారలతో సమావేశమయ్యారు. ఆమె వెంట ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ భారతి, డీఈ కోసాన రాంబాబు, జేఈ ఎ.శివాజీ ,రమ్య అనూష, బెండపూడి టీడీపీ, జనసేన నేతలు సాధనాల నూకరాజు, బెండపూడి నాయుడు తదితరులు ఆమె వెంట ఉన్నారు.


బావిని పరిశీలిస్తున్న అధికారులు

1200 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో బియ్యం మూటలు

తుని రూరల్, జూన్ 18: కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం దొండవాక గ్రామంలో ఎండీయూ ఆపరేటర్ ఇంటి నుంచి సుమారు 1200 కిలోల పీడీఎస్ బియ్యం గుట్టు చప్పుడు కాకుండా తరలించేయడంతో గమనించిన గ్రామస్తులు పీడీఎస్ బియ్యంతో ఉన్న ఆటోను అడ్డగించారు. అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వగా రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆటోను సంబంధిత డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా పీడీఎస్ బియ్యం పట్టుబడటం విధితమేనని దీనిపై కేసు నమోదు చేసి ఎవరు విక్రయించారు, ఎక్కడకు వెళుతున్నాయనే దానిపై వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

ద్రాక్షారామ, జూన్ 18: రామచంద్రపురం మండలం ఓదూరు రైల్వే క్రాసింగ్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేళంగి గ్రామానికి చెందిన యరమాటి కృష్ణచైతన్య చౌదరి (16) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేళంగి గ్రామానికి చెందిన కృష్ణ చైతన్య చౌదరి తన సోదరుడు షాపు ముందు పార్కు చేసిన హీరో హోండా మోటారు సైకిల్‌ను ఎవరికీ చెప్పకుండా తీసుకుని సోమవారం రాత్రి 6.50 గంటల సమయంలో వేళంగి నుంచి రామచంద్రపురం వైపు బయలుదేరాడు. ఓదూరు రైల్వే క్రాసింగ్ వద్దకు వచ్చే సరికి స్పీడ్ బ్రేకరు వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోగా స్పృహ కోల్పోయాడు. తెలిసిన వ్యక్తులు కృష్ణ చైతన్యచౌదరి పెదనాన్నకు సమాచారం అందించారు. దీంతో కృష్ణచైతన్య పెదనాన్న వేళంగి ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లి అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామచంద్రపురం ఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డుగోడ కూలింది..

- ఆంజనేయనగర్ వాసుల కళ్లల్లో ఆనందం
- గత వైసీపీ పాలనలో దారికి అడ్డంగా గోడ
- ఎమ్మెల్యే నల్లమిల్లి సమక్షంలో తొలగించిన వైనం


గోడ కూల్చుతున్న ఎక్సకవేటర్


ఎమ్మెల్యే నల్లమిల్లి దగ్గర ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అనపర్తి, జూన్ 18: అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో అధికారులు అనపర్తిలోని ఆంజనేయ నగర్ వాసుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ప్రహరీని మంగళవారం తొలగించారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అనపర్తిలోని ఆంజనేయనగర్ వాసులు 40 సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న రోడ్డును హైస్కూల్ ప్రహరీ నిర్మాణం పేరుతో వైసీపీ నాయకులు దారిని మూసివేశారు. గోడ నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగించారు. ఈ నేపథ్యంలో అదే కాలనీకి చెందినకర్రి అరుణకుమారి మనస్తాపంతో ఆత్యహత్యకు పాల్పడింది. కాలనీ వాసులు ఉపయోగిస్తున్న రోడ్డుకు ఇబ్బంది లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడతామని అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హామీ ఇచ్చి చివరకు పోలీసుల సహాయంతో ఎవ్వరినీ దరి చేరనీకుండా రోడ్డు మూసివేస్తూ గోడ నిర్మించారని దీనితో తాను గుడికి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని కాలనీకి చెందిన అరుణకుమారి ఆత్మహత్యకు పాల్పడింది. అంతే కాకుండా తన ఆత్మహత్యకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కారణమంటూ ఆమె సూసైడ్ నోట్ రాయడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. దీంతో ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబానికి, కాలనీ వాసులకు అండగా నిలవడమే కాకుండా తాము అధికారం చేపట్టగానే ప్రహరీ అడ్డంకి తొలగించి కాలనీ వాసులకు రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ముఖ్యంగా ఆంజనేయరెడ్డి నగర్ వాసుల ఇబ్బందులు, పరిసరాల్లో ఆక్రమణలపైనా చర్చించారు. అనంతరం ఆంజనేయరెడ్డి నగర్‌కు అధికారులతో చేరుకున్న ఎమ్మెల్యే కాలనీ వాసులకు రహదారి కల్పించాలని నిర్ణయించారు. దీంతో అధికారులు జేసీబీతో కాలనీలోని రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీని ప్రధాన రహదారికి అనుసంధానం చేసే చోట ఉన్న ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న కాలనీ వాసులు ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఆత్మహత్యకు పాల్పడిన అరుణకుమారి భర్త సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు రహదారి ఏర్పడటంతో తన భార్య ఆత్మ శాంతించిందని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బాసి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి




రాజు(ఫైల్‌ఫొటో)

కడియం, జూన్ 18: జాతీయ రహదారిపై కడియం మండలం పొట్టిలంక వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన బీరక రాజు(44) మోటారుసైకిల్‌పై సెంటర్‌కు వెళుతూ హైవే రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో రావులపాలెం నుంచి వేమగిరి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో రాజు తలకు తీవ్రగాయం అయింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బీరక రాజు భార్య లక్ష్మీవెంకట సంధ్య ఫిర్యాదు మేరకు కడియం ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం


భవాని(ఫైల్)

రాజానగరం, జూన్ 18 : తోటికోడలు ఆకస్మిక మృతితో మానసిక ఆందోళనకు గురైన వివాహిత సోమవారం తెల్లవారుజామున ఇంటి నుంచి అదృశ్యమైంది. రాజానగరం మండలం తూర్పుగోనగూడెం గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గల్లా భవాని అనే మహిళ ఈ నెల 17న తెల్లవారుజామున ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బయటకు వెళ్లే సమయంలో మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులు తీసి ఇంట్లోనే వదిలివెళ్లింది. భవాని తోటి కోడలు అనారోగ్యంతో ఈ నెల 14న అకస్మాత్తుగా మృతిచెందింది. అప్పటి నుంచి మానసిక ఆందోళనతో గడుపుతున్న భవానీ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో వెళ్లిపోయింది. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నీలం రంగు చీర, జాకెట్టు ధరించి ఉన్నట్లు ఆమె కుమార్తె దేవి చెప్తోంది. బంధువుల ఇంటి వద్ద పరిసర ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ లభించలేదు. భవాని అల్లుడు భూషంశెట్టి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజానగరం పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని సీఐ పి.కాశీవిశ్వనాథ్ కోరారు.

ఘనంగా పండిత సదస్యం

మామిడికుదురు, జూన్ 18: అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా పండిత సదస్యం కార్యక్రమాన్ని మంగళవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు, వేద పారాయణం, మంగళాశాసనములు తదితర కార్యక్రమాలతో వేద సదస్యం(పండిత సన్మానాన్ని) ఘనంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మామిడికుదురుకు చెందిన యింటి శ్రీరామ్‌కుమార్, సుజాత ఆలపించిన అన్నమాచార్య సంకీర్తన విభావరి, అప్పనపల్లికి చెందిన శేష శారద భక్త బృందం వారు ఆలపించిన పురందరదాసు కీర్తనలు, మానేపల్లికి చెందిన ప్రకాశ్ గురుస్వామి భజనా కార్యక్రమం భక్తులను రంజింపచేశాయి. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పండిత సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

గోగన్న మఠంలో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

మామిడికుదురు, జూన్ 18: గోగన్నమఠం గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కురుడీ కొబ్బరి రాశులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన అల్లు సురేష్ బాబు కొబ్బరికొట్టులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కురుడీ కొబ్బరికాయల రాశులు అంటుకున్నాయి. రాజోలు అగ్నిమాపక దళం వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సుమారు రూ.2 లక్షల కురుడీ కొబ్బరి కాయలు ప్రమాదంలో దగ్ధమయ్యాయని బాధితుడు పేర్కొన్నాడు.


కాలిపోయిన కొబ్బరికాయలు



మాట్లాడుతున్న గంధం సునీత

రాజీ మార్గంతో సమయం ఆదా

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ మార్గంతో సమయం ఆదా అవుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. న్యాయవాదులకు నిర్వహించే మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందన్నారు. ఖర్చు లేకుండా సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఐదు రోజుల్లో 40 గంటల పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన న్యాయవాదులకు బెంగళూరుకు చెందిన ప్రొటెన్షియల్ ట్రైనర్స్ గీతాదేవి, బి.శ్రీకుమార్, చెన్నైకి చెందిన సీనియర్ ట్రైనర్ ఆర్.విజయ కమల మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ అందిస్తారన్నారు. ఈ నెల 26వ తేదీ వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో ఖైదీలకు శిక్షణ


స్వాతికి మొక్క అందిస్తున్న సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఖైదీలకు మొక్కల పెంపకంలో ఈ నెల 18 నుంచి 30 వరకూ శిక్షణ ఇస్తున్నామని సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. వివిధ రకాల పండ్లు, పూలు, క్రోటాన్స్ మొక్కల పెంపకంలోని మెలకువలను నేర్పిస్తున్నామన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ కె.స్వాతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలను అభివృద్ధి చేయడం తద్వారా ఉపాధి పొందడాన్ని వివరించారు. మొక్కల పెంపకంలో కృషి ఎంత ఉంటే అంతగా సంపాదన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, మునిసిపల్ ఉద్యానవన ఉద్యోగి బాలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కొత్తపల్లి, జూన్ 18: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ బీచ్‌రోడ్డు సమీపంలో మంగళవారం ఓ మత్స్యకారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండంగి మండలానికి చెందిన మైలపల్లి ఎల్లయ్య(53) ప్రతీరోజూ వేట చేసేందుకు అమీనాబాద్ రేవుకు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పెట్రోలు బంక్ సమీపంలో ఎల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మండపేటలో యువకుడి ఆత్మహత్య


నాగదుర్గాకుమార్

మండపేట, జూన్ 18: మండపేటలో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని గొల్లపుంతకు చెందిన సోము నాగదుర్గాకుమార్ (19) పబ్జిఫైర్ ఫ్రీగేమ్ సెల్‌ఫోన్‌లో ఆడుతుంటాడు. ప్రసాద్ తాపీ పని చేస్తుంటాడు. అయితే ఏమైందో తెలియదు కానీ మంగళవారం పనికి వెళ్లి ఇంటికి వచ్చి రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు జరిగిన సంఘటనపై ఆరా తీస్తున్నామని పట్టణ సీఐ అఖిల్‌జమా, ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. యువకుడి ఆత్మహత్యపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రత్నగిరి ప్రకాష్ సదన్‌లో నల్లుల బెడద

- ఏసీ గదుల్లో సైతం నల్లుల బాధే
- బస చేయడానికి వచ్చిన భక్తులు అసహనం
- అయినా పట్టించుకోని పారిశుధ్య విభాగం



అన్నవరం, జూన్ 18: సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు బస చేయాలంటే ముందుగా గుర్తొచ్చేది ప్రకాష్‌సదన్ కాటేజీ.. ఎందుకంటే బస చేసే భక్తులకు ఆహారం, ఇతర అవసరాలకు దగ్గర్లో దుకాణ సముదాయాలు ఉండడం, ఆలయానికి దగ్గరగా ఏసీ గదులతో ఉన్న కాటేజీ కావడంతో ఎవరైనా ముందుగా ప్రాధాన్యమిచ్చేది ఈ కాటేజీకి మాత్రమే. ప్రముఖుల సిఫార్సు లేఖలకు, పాలకమండలి సభ్యులు విచ్చేసినా ఈ కాటేజీలోనే బస ఏర్పాటు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కాటేజీలో ప్రస్తుతం బస చేయాలంటే నరకం అనుభవించాల్సి వస్తుందని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి ప్రధాన కారణం నల్లులు ఆవాసంగా ఉండడమే. అయితే ఈ నల్లులు గతంలో ప్రతి ఇంట్లో ఉండేవి కానీ ఇప్పుడు ఎక్కడా వీటి జాడ కనపడకపోయినా ప్రకాషసదన్ కాటేజీలో మాత్రం విరివిగా ఉన్నాయి. 84 గదులున్న ఈ కాటేజీలో గది తీసుకోవాలంటే ప్రస్తుతం భయపడుతున్నారు. రోజుకు సుమారు 80 వేలరూపాయలు అద్దె వచ్చే కాటేజీ అయినా నల్లుల నిర్మూలనకు శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం విచారకరం. నాలుగు అంతస్తులలో ఉన్న ఈ కాటేజీలో వారానికి ఒక్కొక్క ఫ్లోర్ భక్తులకు అద్దెకివ్వకుండా నివారణ చర్యలు చేపట్టే మార్గం ఉన్నా ఆ దిశగా శానిటరీ వర్కర్లు ప్రయత్నించే దాఖలాలు కనబడడం లేదు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి భక్తులను నరకయాతన నుంచి బయటపడేలా చేయాలని కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా నల్లులు ఉన్నమాట వాస్తవమేనని గతంలో కెమికల్స్ వేసి చర్యలు చేపట్టినా నిర్మూలన కాలేదని ఈ కాటేజీలో వారం రోజులు పాటు పూర్తిగా గదులు అద్దెకివ్వకుండా ఉంటే ప్రత్యేక చర్యల ద్వారా శాశ్వతంగా నిర్మూలించవచ్చునని అన్నారు.

భర్త దాడిలో భార్య మృతి


మృతిచెందిన మహిళ

కాట్రేనికోన, జూన్ 18: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పోర గ్రామానికి చెందిన అర్ధాని కస్తూరి(36) భర్త కొట్టడంతో మృతి చెందింది. తన భర్త సతీష్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో మంగళవారం కస్తూరి సతీష్‌ను నిలదీసింది. ఆగ్రహించిన సతీష్ సాయంత్రం భార్యను కొట్టాడు. ఈ దెబ్బలకు కస్తూరి మృతి చెందింది. కస్తూరి తల్లి బలుసుతిప్పకు చెందిన సంగాని కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మొక్కు తీర్చుకున్న బండారు అభిమాని

ఆలమూరు, జూన్ 18: కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు భారీ మెజార్టీతో విజయం సాధించ డంతో ఆయన అభిమాని మేడపాటి రామారెడ్డి జొన్నాడ జాతీయ రహదారిపై వున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నాడు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబీ, ద్వారంపూడి సతీష్, సత్తి శ్రీనివాసరెడ్డి, పడాల శివారెడ్డి, నాంద్ర ఆదినారాయణరెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, దేవగుప్త సత్తిబాబు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



పొడగట్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం, జూన్ 18: బడి ఈడుకు వచ్చిన చిన్నారులందరూ బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకుని 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు కోరారు. పొడగట్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో పి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు కో-ఆర్డినేటర్ మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అక్షరాస్యులైనప్పుడే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. 6నుంచి 14ఏళ్లలోపు చిన్నారులందరూ బడిలో ఉండేందుకు ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు నాగసత్యవేణి, మల్లేశ్వరపు నాగరాజు, మారే రాజబాబు, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రోత్సహించండి

మలికిపురం, జూన్ 18: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణలు పిలుపునిచ్చారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా పిల్లల ఇళ్లకు వారు వెళ్లారు. మండలంలో ఉన్న 12హైస్కూళ్లు, 4యూపీ పాఠశాలలు, 62 ప్రాథమిక పాఠశాలల్లో 4,348విద్యార్థులు చదువుతున్నారన్నారు. 37,690 పుస్తకాలకు 31,420 వచ్చాయని వాటిని విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు.

పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి

అంతర్వేది, జూన్ 18: బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిని మళ్లీ బడిలో చేర్పిద్దాం అనే మంచి ఉద్దేశంతో నూతన ప్రభుత్వం నేను బడికి పోదా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టేకిశెట్టిపాలలెంలో ఏటిగట్టుకు దిగువన ఉన్న ప్రాంతంలో ఎంఈవోలు కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావులు ఉపాధ్యాయుల సహకారంతో ఇంటింటికీ తిరిగి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి బడిఈడు పిల్లలను పనులకు కాకుండా పాఠశాలలకు పంపించాలని వారికి విద్య ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈప్రత్యేక డ్రైవ్ జూలై 12 వరకు కొనసాగుతుందని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు కిశోర్, జానకీ, హెచ్‌ఎం విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు ఇందిర, సుజాత పాల్గొన్నారు.

దివ్య జ్ఞాన మోక్ష హోమం

అమలాపురం టౌన్, జూన్ 18: ఏర్పేడు వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి స్వీయ పర్యవేక్షణలో అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలోని విశ్వశాంతి కోరుతూ లోక కల్యాణార్థం 3890వ దివ్య జ్ఞాన మోక్ష హోమం మంగళవారం నిర్వహించారు. వారాహి షోడస రాత్రి పూజా మహోత్సవాల్లో భాగంగా జూలై 5నుంచి 21వరకు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పరిపూర్ణానందగిరి స్వామి పాల్గొంటారని శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర వ్యవస్థాపకురాలు పి.నాగకనకదుర్గ, నంబూరి తేజకుమారితెలిపారు. దివ్య జ్ఞాన మోక్ష హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పోతురాజు రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.విజయారెడ్డి, డాక్టర్ వాసవి, కేవీమావుళ్లయ్య, చాగంటి ప్రసాద్, తూము దొరబాబు, కవురు అనసూయమ్మ, గొవ్వాల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

రేపు గుర్రం ధర్మోజీరావు సంస్మరణ సభ

మామిడికుదురు, జూన్18: తాటిపాక పంచాయతీ రోడ్డులో గల రాజోలు తాలూకా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ భవనం వద్ద ఈనెల20న గుర్రం ధర్మోజీరావు సంస్మరణ సభ జరుగుతుందని దళిత చైతన్యవేదిక నాయకులు తెలిపారు. సంస్మరణ సభ కరపత్రాలను మంగళవారం నగరంలో దళిత చైతన్యవేదిక నాయకులు ఆవిష్కరించారు. వివిధరంగాల్లో సేవలందించిన 15మంది ప్రముఖులకు ధర్మోజీరావు స్మారక పురస్కారాలు అందిస్తామన్నారు. బత్తుల జనార్ధనరావు, బత్తుల మురళీకృష్ణ, దీపాటి శివప్రసాద్, చిలకపాటి శ్రీధర్, మండపాటి మధు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి: సుభాష్



ఎస్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్



సుభాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్, జూన్ 18: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను గొంతెత్తి ప్రపంచానికి తెలిపిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని మంగళవారం అమలాపురంలో మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘ పక్షాన మంత్రికి నోటు పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు ఆధ్వర్యంలో తొలుత మంత్రిని సత్కరించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, సంఘ నాయకులు నల్లి ప్రసాద్, అల్లు శ్రీనివాస్, నిమ్మన సత్యనారాయణ, నల్లా రామకృష్ణ, వేమన సత్యనారాయణ, సీహెచ్‌వీ కృష్ణమూర్తి, నందెపు శ్రీనివాస్, ఆకుల బాలబసవేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి..

అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్లోని శ్రీదేవి అమ్మవారిని మంత్రి సుభాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ తరపున అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, నాయకులు గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు, పిండి రాజా పాల్గొన్నారు.

డీఈవో అభినందనలు

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శ్రీరామపురంలోని ఆయన స్వగృహం వద్ద మంగళవారం పలువురు అధికారులు, సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశరావు, హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విత్తనాల శ్రీనివాస్, పీఈటీల అసోసియేషన్ జోన్ అధ్యక్షుడు యనమదల బుజ్జి, సంయుక్త కార్యదర్శి బొంతు వీవీఎస్ఎన్ మూర్తి, వి.బుజ్జి మంత్రిని అభినందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, కోనసీమ జేఏసీ నాయకుడు కరాటం ప్రవీణ్ మంత్రిని సత్కరించిన వారిలో ఉన్నారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం సోదరులు మంత్రికి చేనేత వస్త్రాన్ని బహూకరించారు.

పామర్రులో నేత్ర దానం



కె.గంగవరం, జూన్ 18: పామర్రుకు చెందిన తూము వీరభద్రమ్మ(83) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సామాజిక సేవ కార్యకర్త వెంకటరత్నం విజ్ఞప్తితో ఆమె నేత్రాలు దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. కాకినాడ ఐ బ్యాంకు ప్రతినిధులు వీరభద్రమ్మ నేత్రాలు సేకరించారు. మనుమడు రమేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

సహజసిద్ధ ఆహారం తీసుకోవాలి

ద్రాక్షారామ, జూన్ 18: రసాయనాలు లేని సహజసిద్ధ ఆహారం తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శన జరిపారు. హెచ్‌ఎం కె.కె.ఎల్.కుమారి, ఉపాధ్యాయులు ఎం.స్వాతి, జి.ఉమాశ్రీవాణి, పి.రవికుమార్, గ్రామ పెద్దలు దంగేటి లోవరాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను భయపెడుతున్న వేసవి గాల్పులు

మలికిపురం, జూన్ 18: తొలకరి తొంగి చూసినా ప్రజలకు వేసవి తాపం తప్పడం లేదు. రోహిణీ కార్తెను మించి నాలుగు రోజులుగా కాస్తున్న ఎండలకు ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు విద్యుత్ కోతలతో ప్రజలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



ఆలమూరు: జొన్నాడలో గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో అంగన్‌వాడీ చిన్నారులు

ఆలమూరు, జూన్ 18: మడికి, జొన్నాడ గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో అలరించారు. ఐసీడీఎస్ కొత్తపేట సీడీపీవో శారద మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, వరలక్ష్మీదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: అంగన్‌వాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ మంగళవారం పాశర్లపూడి బాడవలో జరిగింది. పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీవో విజయశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ స్కూల్స్‌లో ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తారని తెలిపారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎన్.సుబ్బలక్ష్మి, బి.అన్నపూర్ణ, పి.విజయలత, స్కూలు ప్రధానోపాధ్యాయిని సీహెచ్ సుజాత, టి.వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లిలంకలో అంగన్‌వాడీ కేంద్రం-195లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. రాజోలు ఐసీడీఎస్ డిపార్టుమెంటు, సీడీపీవో రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ ప్రీ స్కూలుకు మూడేళ్లు నిండిన పిల్లలను పంపించాలన్నారు. మంచి పౌష్టికాహారం, సదుపాయాలు అందిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయభారతి, రేఖూరి ఏసునరసింహరాజు, కామన దొరబాబు, అంగన్‌వాడీ కార్యకర్త కొండా ఆశాజ్యోతి, రుద్రరాజు భవానీ, జి.సునీత, వాస్కూరి లీల పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వడ్లమూరులో మంగళవారం సీడీపీవో ఎ.గజలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్‌డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను అందించి ఐదేళ్లు పూర్తయిన పిల్లలను ప్రాథమిక విద్యకు సిద్ధం చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేస్తారన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజర్ మాణిక్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, విజయరత్నం, ఆయాలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు లేని వ్యాపారులను గుర్తించాం



మున్సిపల్ సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్, జూన్ 18: అమలాపురం పట్టణంలో ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్న వారిని ఇప్పటికే గుర్తించామని మున్సిపల్ కమిషనరు మనోహర్ తెలిపారు. పురపాలక చట్టప్రకారం వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు పొంది ఉండాలన్నారు. లేకపోతే పురపాలక సంఘానికి ఆర్థిక నష్టం చేకూరుస్తుందన్నారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలో శానిటేషన్, ప్లానింగ్, ఇంజనీరింగ్ కార్యదర్శులు, సెక్షన్ అధిపతులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రధానమైన డ్రైనేజీ సమస్యపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం ప్రతి వార్డులోనూ మ్యాప్‌లు తయారుచేయాలని, డ్రైనేజీల్లో సిల్టు తీయించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రేడల్ లైసెన్సు తీసుకోని వ్యాపారులకు నోటీసులు జారీ చేశామన్నారు. నెలాఖరులోగా లైసెన్సు తీసుకోని వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనరు హెచ్చరించారు. అక్రమ కుళాయిలను గుర్తించామని, వాటిని క్రమబద్ధీకరించకుంటే కనెక్షన్ తొలగిస్తామన్నారు. రోడ్డు మార్జిన్లు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు.

అరటి చెత్త ఆటోలో చెలరేగిన మంటలు

ఆత్రేయపురం, జూన్ 18: మండలంలోని బొబ్బర్లంక మీదుగా మంగళవారం సాయంత్రం ధవళేశ్వరం వైపు అరటి చెత్తతో వెళుతున్న ఆటోలో పిచ్చుకలంక వద్ద మంటలు చేలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారులు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ద్రాక్షారామ, జూన్18: మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదినం పురస్కరించుకుని యనమదల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు మంగళవారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు విత్తనాల వెంకటరమణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లంకతల్లెమ్మ తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం, జూన్ 18: గత నెల28న ప్రారంభమైన ముమ్మిడివరం గ్రామదేవత తల్లెమ్మ తీర్థ మహోత్సవం, జాతర కార్యక్రమాలు 20రోజులు వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి గరగ నృత్యాలు, భజాభజంత్రీలు, డప్పుల వాయిద్యాలతో బాణసంచా కాల్పుల నడుమ నగర పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. మంగళవారం అమ్మవారి తీర్థం ఘనంగా జరిగింది. పుట్టింటి ఆడపడుచులు, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు సమర్పించారు. చీర, సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం నిర్వహించే దండాడింపుతో జాతర మహోత్సవాలు ముగియనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తోట వెంకటేశ్వరరావు-పద్మావతి దంపతులు, రవికిశెట్టి రామసుబ్బారావు-సూర్యకుమారి దంపతులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. క్రాప గ్రామంలో మహాలక్ష్మమ్మవారి సోమవారం రాత్రి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భజాభజంత్రీలు, బాణసంచా కాల్పులు, గరగనృత్యాలతో అమ్మవారిని ఊరేగించారు. మంగళవారం తీర్థం జరిగింది. పుట్టింటి ఆడపడుచులు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని చలిమిడి పానకాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

ఘనంగా రావులమ్మ అమ్మవారి తీర్థం



రావులమ్మ

అంబాజీపేట, జూన్ 18: గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీ రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతోసుందరంగా అలంకరించారు. గ్రామమంతా ఆడపడచులతో కళకళలాడింది. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మరిడమ్మ తీర్థం

అల్లవరం, జూన్18: గూడాల గ్రామదేవత మరిడమ్మ తీర్థం మంగళవారం జరిగింది. మహిళలు, భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, గాజులు, పసుపు కుంకుమలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కపిలేశ్వరపురం, జూన్ 18: వల్లూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. గోవింద చరిత పారాయణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిప్రతిష్ఠ, వాస్తుహోమం, బలిహరణ, ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో పలువురు అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



లక్ష్మీనరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి

అంతర్వేది, జూన్ 18: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ఉప ఆలయం శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య తిరు కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆసీనులుచేసి అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. విశ్వక్సేనపూజ, అంకురార్పణ, పుణ్యహవచనం, ధ్వజావరోహణ నిర్వహించారు. సాయంత్రం స్వామి-అమ్మవార్లకు పల్లకీలో గ్రామోత్సవం జరిపించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానాచార్యులు వి.రంగాచార్యులు, ప్రధానార్చకులు పి.శ్రీనివాస్‌కిరణ్, పి.వెంకటశ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, భక్తులుపాల్గొన్నారు.

ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామివారి జన్మ స్వాతి నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. ఆలయంలో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలను అర్చకులు జరిపించారు.

ఐటీఐ అభ్యర్థులకు రేపు ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, జూన్ 18: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో 2024-25 సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి కాకినాడలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని కోరారు. ఈనెల 20నుంచి 25వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. 20న మెరిట్ నంబరు 1 నుంచి 137 వరకు, మధ్యాహ్నం 138 నుంచి 286 వరకు, 21న ఉదయం 287 నుంచి 404, మధ్యాహ్నం 405 నుంచి 561 వరకు, 22న ఉదయం 562 నుంచి 707 వరకు, మధ్యాహ్నం 708 నుంచి 838 వరకు, 23న ఉదయం 839నుంచి 1005 వరకు, మధ్యాహ్నం 1006 నుంచి 1115 వరకు, 24న ఉదయం 1 నుంచి 286, మధ్యాహ్నం 287 నుంచి 561 వరకు, 25న మెరిట్ 562 నుంచి 1115 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వర్మ చెప్పారు.

పారిశుధ్యం, తాగునీటిపై శ్రద్ధ చూపాలి: డీఎల్పీవో

అల్లవరం, జూన్ 18: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వనరుల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని డీఎల్పీవో బొజ్జిరాజు కోరారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వీఎస్ఎస్ కృష్ణమోహన్ అధ్యక్షతన పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏఎన్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలంలోని 58మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, తాగునీటికిట్ల ద్వారా పరీక్షలు జరపాలన్నారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేపలు తినకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి, ఏవో లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, రమణమ్మ పాల్గొన్నారు.

కేరళ పీజీ ఎంట్రన్స్‌లో కొత్తపేట విద్యార్థుల సత్తా



కొత్తపేట, జూన్ 18: కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు గనిశెట్టి రామకృష్ణమోహన శంకర్, కొల్లాటి జాయసీ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ పీజీ ఎంట్రన్స్‌లో 6, 7ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీరాజు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: రక్షణ
శేఖర్ స్క్రీన్-1	: ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	: బ్యాడ్‌బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

పర్యావరణంపై అవగాహన

అంతర్వేది, జూన్ 18: ఏపీఎస్సీసీ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుతున్న ఏడు రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఐదో రోజు సుస్థిర ఆహార వ్యవస్థ, పర్యావరణంపై సఖినేటిపల్లిలంక హైస్కూలులో ఏపీ ఎస్సీసీ మోనటరింగ్ అధికారిణి జి.ప్రభావతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో గోంగూర, మునగ, అరటి, జామ, పుదీన, వాము తదితర రకాల మొక్కలు నాటారు. ఎరువులు వాడకుండా కూరగాయలు ఏవిధంగా పండించాలో విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వీవీ నరసింహారావు పలు సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన బుచ్చిబాబు



ఐ.పోలవరం, జూన్ 18: ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల బుచ్చిబాబు మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

కేశవరంలో రోడ్డు పనులకు శంకుస్థాపన

మండపేట, జూన్ 18: కేశవరంలో రూ.45లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. కేశవరం గ్రామాన్ని దశలవారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక టీడీపీ, జనసేన నేతలు, కర్రి తాతారావు, ఉండమట్ల రామారావు, కంటిపూడి శ్రీనివాస్, ఉండమట్ల సురేష్, అళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

పి.గన్నవరం, జూన్18: పాస్టర్ల మండల నూతనకార్యవర్గాన్ని కెవైలు రీజనల్ చైర్మన్ కె.రాజురత్నం, గాడ్స్‌వే స్టేట్ కోఆర్డి నేటర్ పాస్టర్ జాన్‌పాల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా జె.ఇమ్మానుయేలు, కార్యదర్శిగా సీహెచ్ సువర్ణరాజు, ట్రెజరర్‌గా డి.ఏసురత్నం, జాయింట్ సెక్రటరీగా కె.ఆర్.ఆర్.సింగ్ ఎన్నిక య్యారు. కార్యవర్గానికి సీనియర్ పాస్టర్లు, స్థానిక పాస్టర్లు అభినందనలు తెలిపారు.

ఎంపీపీ కేతాకు ఘనసన్మానం

రాజోలు, జూన్ 18: నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడు శంకరపు ఆదినారాయణ, అధ్యక్షుడు యిల్లింగి వెంకటరమణ, అన్ని సంఘాలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఎమ్మెల్యే దేవ ఘన విజయంలో ప్రత్యేక పాత్ర పోషించిన ఎంపీపీ కేతాను తాటిపాకలోని ఆయన స్వగృహంలో అగ్నికుల క్షత్రియ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు విజయానికి కాకినాడ టీడీపీ పరిశీలకుడిగా కృషిచేసిన ఎంపీపీ కేతాను అగ్నికుల క్షత్రియ సాధికార సమితి నాయకులు తిరుమాని అచార్యులకు ఘన సన్మానం చేశారు. అంతర్వేది మహాగజమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గజమాల ఫౌండర్ చింతా మహానాగరాజు, సఖినేటిపల్లి మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కొల్లు మహాలక్ష్మి, గొంది సొసైటీ అధ్యక్షుడు కొల్లు రాము, అంతర్వేదిపల్లిపాలెం గ్రామశాఖ అధ్యక్షుడు పోతాబత్తుల రాంబాబు, సోంపల్లి యువ నాయకుడు మల్లాడి అర్జున్, సంగాని కిరణ్, బస్వాని రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

కాట్రేనికోన, జూన్18: కుంచనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నడవపల్లి పల్లిపాలేనికి చెందిన కర్రి శ్రీనివాస్ నోట్ పుస్తకాలు, పెన్సిళ్ళు, ఎరైజర్స్, షార్ప్‌నర్స్ పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కేటీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, చింతా రాంబాబు, సీఆర్పీ మంత్రిప్రగడ శ్రీనివాస్, కర్రిరాంబాబు, బి.సురేంద్ర, శీలం లీలాకుమారి, టి.లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాట్లకు డ్వామా పీడీ శుభాకాంక్షలు

ముమ్మిడివరం, జూన్ 18: ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజును డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలుతెలిపి దుశ్శాలువాతో సత్కరించారు.

జనసేనలో చేరిన వైసీపీ సర్పంచ్



చొప్పెల్ల గ్రామ సర్పంచ్‌కు కండువావేసి ఆహ్వానిస్తున్న బండారు శ్రీనివాస్

కొత్తపేట, జూన్ 18: చొప్పెల్ల గ్రామ సర్పంచ్ దంగేటి చంద్రకళబాపనయ్య వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. మంగళవారం వాడపాలెంలోని పార్టీ కార్యాలయంలో వారికి జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కండువావేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసైనికులు సూరపరెడ్డి సత్యనారాయణ, సోము గంగాధర్, పళ్ల శ్రీనివాస్, సోము శ్రీనివాస్, జంపోలు నాగేశ్వరరావు, నాగిరెడ్డి మహేష్, తోరాటి వెంకటేశ్వర్లు, తోరాటి నాని, ఆకుల వెంకన్న, దంగేటి సత్యనారాయణ, మల్లవరపు దుర్గయ్య ఆకేటి బాబు, కర్రి నాగశివ, అన్యం దుర్గారావు, ఎస్.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.1.98 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,98,710 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. ఆలయంలోని వసంత మండపంలో రూ.10లక్షలతో గ్రానైటు నిర్మాణ పనులను వేగవంతం చేశారు.

రేపటి నుంచి వంతుల వారీగా సాగునీరు

అంబాజీపేట, జూన్ 18: ముక్కామల లాకుల ద్వారా భూములకు ఈనెల19నుంచి 21వరకు 48గంటలు వంతుల వారీగా సాగునీరు అందిస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ తెలిపారు. నేదునూరు, మోడేకుర్రు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, సావరం, గ్రామాల రైతులు పంట బోదెలను శుభ్రం చేసుకుని సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా చూసుకోవాలన్నారు.

30న పెనుగొండలో ధర్మాచార్య సమ్మేళనం

అమలాపురం టౌన్, జూన్ 18: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని శ్రీవాసవీధామ్‌లో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల30న ధర్మాచార్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందులో భాగంగా కామాక్షీ పీఠాధిపతి కామేశమహర్షితో పాటు నల్లమిల్లి గీతాశ్రమంలోని మాతాజీలను, అంతర్వేదిలోని స్వామిజీలను మంగళవారం కలుసుకుని ఆహ్వాన పత్రాలు అందజేసినట్టు ఆయన చెప్పారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర సహ కన్వీనర్ శిరంగు నాయుడు, భమిడిపాటి కృష్ణమూర్తి, వేణుగోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

రాయవరం, జూన్ 18: వెదురుపాక, రాయవరం పాఠశాలల్లో ఎంఈవో-2 సూర్యనారాయణ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. చెల్లూరు, పసలపూడి గ్రామాల్లో పలు పాఠశాలలను ఎంఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఐ.పోలవరం, జూన్ 18: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మంగాపాలేనికి చెందిన మంగా వీరభద్రంతో కొమరగిరి గ్రామానికి చెందిన మంగా నిర్మలసత్యవాణి(21)కి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కుటుంబ కలహాలతో మంగళవారం ఉదయం ఇంటి బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ముమ్మిడివరం సీఐ కొండయ్య విచారణ ప్రారంభించారు. ఆమె తల్లి మహదశ నాగమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

భర్త వేధింపులపై మహిళ ఫిర్యాదు

పి.గన్నవరం, జూన్ 18: భర్త వేధింపులు తాళలేక మహిళ పోలీసులను ఆశ్రయించింది. పి.గన్నవరం శివారు అంబటివారిపాలేనికి చెందిన నక్కా వెంకటేశ్వరరావు కుమార్తె వెంకటలలితకు 2022 మార్చిలో నాగుల్లంక శివారు పెదకందాలపాలేనికి చెందిన దాకే నాగేంద్రప్రసాద్‌తో వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. అదనపుకట్నం కోసం వెంకటలలితను భర్త, అత్త మంగాదేవి, ఆడపడుచు నీలిమలు శారీరకంగా, మానసికంగా వేధించారు. దీంతో ఈవిషయాన్ని పెద్దలు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, జూన్ 18: విద్యార్థులు ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో ఉత్తమ ఫలితాలుసాధించాలని రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద లక్ష్మీనరసింహ(ఫణి) అన్నారు. మాచర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాల రికార్డులు, తరగతి గదులు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనపథకం తదితర అంశాలను పరిశీలించారు. ప్రతీ ఉపాధ్యాయుడు విధిగా టీచింగ్ కిట్ కలిగి ఉండాలన్నారు.

నాన్‌నీట్ డ్రాఫ్ట్ జాబితా అభ్యంతరాలకు నేటి వరకు గడువు

యానాం, జూన్18: నాన్‌నీట్ కోర్సులకు సంబంధించి సెంటాక్ విడుదల చేసిన డ్రాఫ్ట్ ర్యాంకులకు సంబంధించి అభ్యంతరాలు తెలియజేయడానికి బుధవారంతో గడువు ముగియనుంది. 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులకు సెంటాక్ ద్వారావిద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల డ్రాఫ్ట్ మెరిట్ లిస్ట్ విడుదల చేసింది. వీటికి సంబంధించి అభ్యంతరాలను అభ్యర్థులు 19వతేదీలోగా తెలియజేయాలన్నారు. అభ్యంతరాల ఫైనల్ మెరిట్ జాబితా విడుదల అనంతరం కౌన్సిలింగ్ జరగనుంది.

వెంకటస్వామినాయుడు కుటుంబానికి పరామర్శ

మామిడికుదురు, జూన్ 18: రూరల్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు నయినాల వెంకటస్వామినాయుడు (పిచ్చియ్య) అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. స్వామినాయుడు భౌతికకాయం వద్ద మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అలాగే ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోతు కాశీ, కూనపరెడ్డి రాము తదితరులు ఉన్నారు.